
# ...దొంగల క్షేమం

## తటవర్తి రామచంద్రరావు




రాత్రి రెండయింది. ఏలూరు నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో లారీల రద్దీ విపరీతంగా వుంది.

ఐదుగురు పోలీసులు ప్రతి లారీని ఆపుతున్నారు. ముడుపులు ముట్టచెప్పిన వాళ్ల లారీలను చెక్ చేయకుండా వెంటనే వదిలిపెట్టేస్తున్నారు. కొంచెం బెట్టు చేస్తున్న వాళ్లని పక్కగా నిలబెట్టేస్తున్నారు. మరీ మొండి వాళ్ల సామానుని కిందకి దింపమని దబాయిస్తున్నారు. ఈ హడావిడి వల్ల ట్రాఫిక్ బాగా స్లో అయిపోయింది.

అడంగుకి త్వరగా చేరకపోతే జరిగే నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పోలీసులతో బేరాలాడి డబ్బులిచ్చేసి బయటపడమని చాలామంది లారీ ఓనర్లు తమ డ్రైవర్లతో సెల్‌ఫోన్‌లలో చెపుతున్నారు. అక్కడంతా హడావుడిగా వుంది.

సరిగ్గా 3.30 గంటలకి ఓ జీపు అటు వచ్చింది. దాన్ని కూడా చెకింగు పోలీసులు ఆపారు. వాళ్లని చూసి జీపులో ఉన్నవాళ్లు తెల్లబోయారు.

"మేమెవరమో మీకు తెలుసా?" అని డ్రైవరు పక్కన కూర్చున్నతను గంభీరస్వరంతో అడిగాడు.

"మీరెవరైతే మాకేమిటి? ఈ దార్ని వెళ్లేవన్నీ చెక్ చేస్తున్నాం. మీకూ తప్పదు" అన్నాడు ఒక పోలీసు దర్పంగా తన లాఠీతో జీపు బాయ్‌నెట్‌పై టకటకలాడిస్తూ.

వెంటనే అతను కిందకి దిగి ఆ జీపు అద్దం కిందున్న స్టిక్కర్ని పట్టుకుని సర్రున లాగాడు. దాని కింద 'పోలీస్' అని రాసున్న అక్షరాల్ని చూసేసరికి ఆ చెకింగ్ పోలీసు ముఖం వివర్ణమైంది. అదే అసలు పోలీసు జీపు అని, ఆ దిగినవాడు ఎస్సై అని, ఇంతదాకా చెకింగ్ పోలీసుగా చలామణీ అవుతున్న నకిలీ పోలీసుకి అర్థమైంది.

జీపులోంచి దిగిన ఎస్సయ్ రమణమూర్తి తన ఓవర్‌కోటు తీసేసాడు. అతని భుజం మీదున్న పోలీసు బేడ్జి లారీ లైట్ల వెలుగులో తళుక్కున మెరిసింది. "ఇప్పుడు కూడా మేమెవరమో చెప్పమంటావా?" అని వ్యంగ్యంగా అడిగాడతను.

నకిలీ పోలీసు పిక్కబలం చూపించబోయాడు. ఎస్సయ్ చటుక్కున అతని కాలరు పట్టుకుని తన బెల్టు హుక్ నుంచి సర్వీసు రివాల్వరు బయటకి తీసాడు. "ఇది నకిలీ పిస్తోలుకాదు. కదిలితే కాల్చేస్తా"

నకిలీ పోలీసు బిర్రబిగుసుకుపోయాడు.

"ఫోర్నాట్ సెవెన్.. ఇతనికి బేడీలు వెయ్యి" అన్నాడు మూర్తి.

క్షణాల్లో మఫ్టీలో వున్న ముగ్గురు కానిస్టేబుల్స్ కిందకి దిగారు. ఇంతవరకు లారీలను చెకింగ్ చేస్తూ మస్తుగా దండుకుంటున్న ఐదుగురు నకిలీ పోలీసులకీ బేడీలు వేసారు.

వాళ్లాపూట లారీ డ్రైవర్ల నుంచి వసూలు చేసిన డబ్బులున్న బ్యాగుని తెరచి చూసి అదిరిపోయాడు ఎస్సయ్. లెక్క పెట్టలేనన్ని నోట్లున్నాయి.

పావుగంటలో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న లారీలకి విముక్తి కలిగించి నకిలీ పోలీసుల్ని తన జీపులోకి ఎక్కించుకుని స్టేషనుకి తరలించాడు ఎస్సయ్. లోపలికి రాగానే "మీ లీడరెవరు?" అని అడిగాడు.

అంతా తలలు దించుకున్నారే గానీ ఎవరూ బదులివ్వలేదు.

"నిజం చెప్పేస్తే బ్రతికిపోతారు. లేకపోతే మక్కెలిరుగుతాయి" అన్నాడు ఫోర్నాట్ సెవెన్.

"దెబ్బలు తిన్నాకయినా మీరు నిజం చెప్పక తప్పదు. అదేదో ముందే చెప్పి తన్నులు తప్పించుకోండి" అన్నాడు ఫైవ్‌నాట్ త్రీ.

"వీళ్లిలా చెప్పరు సార్.. మన టిఫిను రుచి చూపించాల్సిందే!" అన్నాడు టూఫోర్ సిక్స్.

మూర్తి సైగ చేసాడు. కానిస్టేబుల్స కదిలారు. తమదైన శైలిలో తమ లాఠీలకి పని కల్పించారు.

అంతే! ఐదు నిమిషాల్లో వాళ్ల గొంతులు విచ్చుకున్నాయి. చాలా చాలా విషయాలు బయటపడ్డాయి.

అంతా కొద్దోగొప్పో డిగ్రీల దాకా చదువుకున్న యువకులు. సరైన ఉద్యోగాలు దొరకలేదు కాని అందరికీ గరల్‌ఫ్రెండ్స్‌కి లోటులేదు. వాళ్లని షికార్లకి, సినిమాలకి తిప్పటానికి కాస్ట్లీ గిఫ్ట్‌లు ఇవ్వటానికి వేలల్లో కావాలి. తండ్రులకు స్తోమతు ఉన్నా వేలల్లో డబ్బులివ్వరు. తమకి ఖర్చులు తప్పవు. అతి తెలివికి పోయారు. పోలీసు వేషాలు వేసారు. ఇదీ ఒక ఉద్యోగం అనుకున్నారు. కొన్ని నెలలుగా ఈ దందా కొనసాగిస్తున్నారు. వీకెండ్స్‌లో గరల్‌ఫ్రెండ్స్‌తో షికార్లు చేస్తూ, రాత్రిళ్లు హైవే మీదపడి లారీల వాళ్లనుంచి వేలు దోచుకుంటున్నారు. దీని కోసం నకిలీ చలాను బుక్కుని ప్రింటు కూడా చేయించారు. దొంగ స్టాంపులు సృష్టించారు. నిర్భీతిగా వ్యవహరిస్తున్నారు.

కొన్నాళ్లుగా ఓవర్లోడింగ్ జరుగుతున్న లారీలు చాలా ఆ చెక్ పోస్టు నుంచి అతి సునాయాసంగా తరలిపోతున్నాయని ఎస్.ఐ.మూర్తికి తెలిసింది. నిజం తెలుసుకుందామని తన కానిస్టేబుల్స్‌ని తీసుకుని జీపు మీద పోలీసు పేరుపై స్టిక్కర్ అంటించి మఫ్టీలో అర్ధరాత్రి వేళ చెకింగ్‌కి బయల్దేరాడు. అతని అనుమానం నిజమైంది. అన్వేషణ ఫలించింది. జరుగుతున్న రాకెట్ ఏమిటో అతనికర్థమైపోయింది.

వెంటనే ఇంకా రాత్రి మిగిలి వుందని కూడా చూడకుండా ఆత్రుతగా ఎస్.పి.గవర్రాజుకి ఫోన్ చేసి, సంగతి చెప్పాడు. వాళ్లల్లో రింగు లీడరు ఎవరో తెలుసుకున్నావా అని అడిగాడు ఎస్.పి. అతను నగరంలో పేరు మోసిన బార్ అండ్ రెస్టారెంట్ యజమాని నాగరాజు తమ్ముడని చెప్పాడు మూర్తి.

"వెల్‌డన్ మూర్తీ!" అన్నాడు ఎస్పీ గవర్రాజు.

తెల్లవారాక తనని అప్రీషియేట్ చేయటానికి ఎస్పీగారు స్వయంగా స్టేషనుకి వస్తాడనుకున్నాడు మూర్తి. ఇంటికైనా వెళ్లకుండా తక్కిన రాత్రి అక్కడే రెస్టు తీసుకున్నాడు.



ఉదయం పదకొండు గంటలవేళ ఎస్పీ నుంచి ఫోన్ వచ్చింది, అతన్ని తన ఆఫీసుకి రమ్మని. వచ్చేటప్పుడు రాత్రి నకిలీ పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్న మనీబ్యాగుని కూడా వెంట తెమ్మని.

బహుశా, తన ఆఫీసుకే మీడియావాళ్లని పిలిచి తను పట్టుకున్న ముఠా గురించి చెప్పి ఆ దబ్బుని ప్రదర్శించటానికి ఆయన అలా చెప్పి వుంటాడని ఆశపడ్డాడు మూర్తి. వెంటనే తన జీపులో ఎస్.పి.ఆఫీసుకి బయల్దేరి వెళ్లాడు.

అక్కడెక్కడా మీడియా వాళ్లు కనిపించలేదు. ఆఫీసు ముందు అంతా మామూలుగా వుంది. కొంచెం నిరుత్సాహపడుతూనే ఎస్పీగారి చాంబర్లోకి అడుగుపెట్టాడు.

గవర్రాజుగారికెదురుగా కనిపించాడు బార్ అండ్ రెస్టారెంట్ యజమాని నాగరాజు. విస్తుపోయాడు మూర్తి.


"రావయ్యా మూర్తీ! నీ కోసమే చూస్తున్నాం. రాకూర్చో" అని గవర్రాజు నవ్వు ముఖంతో అన్నాడు.

"థాంక్యూ సార్!" అని ఆయనకి సెల్యూట్ చేసి అలాగే సీరియస్‌గా నిలబడ్డాడు మూర్తి.

ఎస్పీ అనుభవశాలి. తన ఎస్.ఐ.మనసులో ఏమనుకుంటున్నాడో ఇట్టే గ్రహించాడు. "పర్వాలేదయ్యా! కూర్చో! ఈయనెవరో పరాయివాడు కాదు. మనకి బాగా కావాల్సినవాడు" అన్నాడు.

ఇంక తర్వాత ఆయనేం చెప్పబోతున్నాడో మూర్తికి చూచాయగా అర్థమైపోయింది. రాత్రంతా నిద్రలేదేమో అతనికి అలసటగా ఉంది. అస

హనంగా ఉంది. "ఎస్ సర్! అయితే నన్నేం చేయమం టారు?" అన్నాడు తిన్నగా పాయింట్‌కి వచ్చేస్తూ. తను తెచ్చిన మనీ బ్యాగుని ఆయన టేబుల్ మీద పెట్టాడు.




"ఖాళీగా కూర్చున్న కుర్రాళ్లు. ఏదో తోచక చేస్తున్న పనులవి. ఇక నుంచి ఇలాం టివి చేయకుండా చూస్తానని నాగరాజు ప్రామిస్ చేస్తు న్నాడు. కనుక...." అని అర్థో క్తిలో నవ్వాడు గవర్రాజు.

మూర్తికి ప్రాణం ఉసూరు మనిపించింది. తను కొన్నా ళ్లుగా పడుతున్న శ్రమ, గతరాత్రి పడిన కష్టం.. ఇలా వృధా అయిపోవటం అతనికి బొత్తిగా మన స్కరించలేదు. తన ప్రయత్నం తాను చేయాలను కున్నాడు. "ఇది మేము చాలా ప్లాన్ వేసి పట్టుకు నిన దొంగల ముఠా సార్! ఇలా వదలిపెట్టేస్తే మన ఫోర్సులో స్పిరిట్ లేకుండాపోతుంది" అన్నాడు కాస్త అసహనంగా ముఖం పెట్టి.

"ఓయి నీ అసాధ్యం కూలా! నీకు ప్రమోష న్‌కి రికమెండ్ చేయటానికి మరోటి చూస్తాలే వయ్యా" అని గలగల నవ్వాడు గవర్రాజు.

"నా బాధ నా ప్రమోషన్ గురించి కాదు సార్! ఇలాంటి కేసులు వచ్చినప్పుడు మన ఫోర్సుకి ఎంకరేజ్‌మెంట్ ఇవ్వకపోతే... ఎవరూ సిన్సియరుగా పనిచేయరు. అదీ నా బాధ"

"వాళ్లు చిన్నవాళ్లు. వాళ్లకి భవిష్యత్తు లేకుండా చేయటం మనకి భావ్యం కాదు కదా! మనం కాస్త చూసీచూడనట్టుండాలి. లేకపోతే ఎందుకూ పనికిరాకుండాపోతారు. ఓ విధంగా ఇది మన సోషల్ రెస్పాన్సిబులిటీ. కాదంటావా మూర్తీ! ఆలోచించు..."

"మీ మేలు జన్మలో మర్చిపోలేము ఎస్.ఐ.గారూ" అన్నాడు నాగరాజు చేతులు జోడిస్తూ.

"అదీగాక...లారీ వాళ్లకేదో అన్యాయం జరిగి పోయిందని నువ్వేమీ బాధపడనక్కరలేదు మూర్తీ! వాళ్లు ఓవర్లోడు వేసుకుపోతూ ఇంతకి పదింతలు సంపాదిస్తూనే వున్నారు. నీకు తెలి యని సంగతి కాదు కదా" అన్నాడు గవర్రాజు నర్మగర్భంగా నవ్వుతూ.

'ఈ లారీ వాళ్లకి చలాన్లు రాసి డబ్బులు వసూలు చేసి ట్రెజరీకి జమకట్టాలోయ్! ప్రభు త్వాన్ని మోసం చేస్తున్న వాళ్లకి తగిన శిక్ష పడా ల్సిందే!' అని అనేకసార్లు చెప్పిన ఎస్సీగారేనా ఈ మాట లనేది? ఈయన కత్తికి రెండు వైపులా పదునే! ఇంక తనేమి వాదించగలడు? నిస్పృహగా తలాడించి అలాగే నిలబడిపో యాడు మూర్తి.

"ఒకవేళ మనం పట్టుప ట్టినా డిఐజి గార్నించి ఫోను రాకమానదు. వీళ్లంతా పెద్దల పిల్లలు. ఒకడు ఎమ్మెల్యేగారి మేనల్లుడు. మరోడు ఎస్.ఆర్.ఇండస్ట్రీస్ చైర్మన్ కొడుకు. మూడోవాడు ప్రిన్సి పాలుగారి తమ్ముడి కొడుకు... ఇంతమందితో వేగాలంటే మనకి చాలా కష్టం మూర్తీ"

ఇంక ఆయనతో మాట్లాడడం ఒట్టి కంఠ శోష. చేసిన పనికి మెప్పు ఎలాగూ లేదు. ఇక సబార్డినేషన్ కింద ముప్పు రాకూడదు. తన కళ్ళె దుట బేడీలు వేయించిన దొంగలు రాజాల్లా విడు దలై తన కళ్లలోకి గర్వంగా చూస్తూ దర్జాగా వెళ్లి పోవటాన్ని చూస్తూ తను భరించలేడు. అందుకే, అక్కడ్నించే స్టేషనుకి ఫోన్ చేసాడు. ఫోర్ నాట్ సెవెన్‌తో వాళ్లని విడుదల చేయమని ఆజ్ఞలు జారీచేసాడు మూర్తి.

అక్కడొక క్షణం నిలబడ్డం కూడా అతనికి కష్టమైపోయింది. ఎస్సీగారికి సెల్యూట్ చేసి గిరు క్కున వెనుతిరిగాడు.

పోలీసు పై అధికారి రక్షణ దొరి కింది...దొంగలు క్షేమం!

○



## రోహిణి డైరెక్షన్!

బాలతార నుంచి హీరోయిన్‌గా ఎదిగి ఆనక డబ్బింగ్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకున్న అనకాపల్లి అమ్మాయి రోహిణి- త్వరలోనే దర్శకత్వం వహించాలని సన్నాహాలు చేస్తోందిట. మంచి స్క్రిప్టుని కూడా సిద్ధం చేసుకున్నానని, తనదైన స్టయిల్‌లో సినిమాని రూపొందిస్తానని అంటున్న రోహిణికి ఇటు తెలుగులోనే కాకుండా తమిళనాట కూడా డబ్బింగ్ ఆర్టిస్టుగా మంచి పేరుంది. ఇటీవల 'విలన్' (రావణ్)లో ఐశ్వర్యారాయ్‌కి రోహిణి వాయిస్ బాగా సూటయిందని బోల్డు ప్రశంసలు వచ్చాయిట. అలాగే 'రోబో' కూడా ఆమెకి పేరు తెచ్చింది.